ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 31.5
కనిష్ఠం 24.4

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

5

బుధవారం 14 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.50 (310.2522)	68,453	47,347
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.92 (3.67)	793,39	512.82
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.40 (39.66)	39,669	2,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.108 | డ్రెస్ : రూ.180 | స్కిన్‌లెస్ : రూ.200



రాజధానికి నీటి సరఫరా భారం

ఏఎమ్మార్పీపైనే

సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టు పనులు గడువుకు మించి జాప్యమవుతుండడంతో హైదరాబాద్ మహానగరానికి మరో మూడేళ్ల పాటు ఏఎమ్మార్పీ(ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు)నుంచే తాగునీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం జరిగి, రిటైనింగ్ వాల్ కూలడంతో ఈ పనులు జాప్యం కానుండగా, రాజధానికి నీటిసరఫరా భారం ఏఎమ్మార్పీపైనే కొనసాగనుంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

» మరో మూడేళ్లు ఇదే పరిస్థితి » ప్రమాదంతో సుంకిశాల పనుల్లో జాప్యం » అప్పటి వరకు ఏఎమ్మార్పీ నుంచే నీటి సరఫరా » రాజధానికి తాగునీటి సరఫరాతో పూర్తి ఆయకట్టుకు అందని సాగునీరు

ఏఎమ్మార్పీపై హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే భారం తగ్గించడంతో పాటు, వేసవిలో నాగార్జునసాగర్ జలాశయంలో డెడ్‌స్టోరేజీకి నీటిమట్టం పడిపోయినప్పుడు నీటి సరఫరాలో ఇబ్బందిలేకుండా ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం జరిగి, రిటైనింగ్ వాల్ కూలింది. ఈ సంఘటన మొత్తం ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి కారణమైంది. వాస్తవానికి ప్రభుత్వ అంచనా ప్రకారం వచ్చే వేసవి నాటికి కనీసం ఒక్క టన్నెల్ ద్వారానైనా నీటిని అందించేందుకు సిద్ధం చేయాలన్నది లక్ష్యం. కాగా, ఆ దిశగా పనులు కొనసాగిస్తున్న క్రమంలో ప్రమాదం జరగడం, దీనిపై రాజకీయం నెలకొనడంతో ప్రాజెక్టు పనుల్లో అనివార్యంగా జాప్యం తప్పని పరిస్థితి ఏర్పడింది.

2026 వరకు హైదరాబాద్‌కు ఏఎమ్మార్పీ నుంచే నీరు

సుంకిశాల ప్రాజెక్టు కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం 2025 మేనాటికి అందుబాటులోకి రావాల్సి ఉంది. కాంట్రాక్ట్ సంస్థ పేర్కొంటున్న ప్రకారం ఇప్పటివరకు ఇన్‌టేక్‌వెల్ పనులు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70శాతం, ఎలక్ట్రోమెకానికల్ పనులు 40శాతం మేర పూర్తయ్యాయి. ప్రమాదం జరగడంతో సంపు పనులు మళ్లీ మొదటికొచ్చాయి. దీంతో ఈ పనులన్నీ పూర్తవ్వాలంటే మరో ఏడాది అదనంగా సమయం పడుతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అప్పటి వరకు ప్రస్తుతం కొనసాగుతున్నట్లుగానే ఏఎమ్మార్పీ నుంచే హైదరాబాద్‌కు నీటిని అందించాల్సి ఉంటుంది. ఏఎమ్మార్పీలో భాగమైన ఏకేబీఆర్ నుంచి ప్రస్తుతం రోజుకు 525 క్యూసెక్కుల చొప్పున మూడు పైప్‌లైన్ల ద్వారా హైదరాబాద్‌కు నీటిని అందిస్తున్నారు. వేసవిలో సాగర్‌లో నీటిమట్టం తగ్గితే ప్రత్యేకంగా 10 భారీ మోటర్లు ఏర్పాటు చేసి నీటిని తోడి పంపింగ్ చేయాలి. 2021లో, 2024లో రెండు పర్యాయాలు ఈ పరిస్థితి కొనసాగింది. సుమారు 16ఏళ్ల నుంచి హైదరాబాద్‌కు సాగర్‌నీటిని అందిస్తున్న నేపథ్యంలో నల్లగొండ జిల్లాలోని ఏఎమ్మార్పీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించలేకపోయారు. సుంకిశాల అందుబాటులోకి వస్తే ఏఎమ్మార్పీకి ఆ భారం తప్పుతుందని భావించినా, అనూహ్యంగా ప్రాజెక్టులో ప్రమాదంతో వివాదంలో చిక్కుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇంకోవైపు ఏఎమ్మార్పీ, సుంకిశాల వంటి ఎత్తిపోతల పథకాలతో అవసరం లేకుండా గ్రావిటీతో నల్లగొండ జిల్లాకు నీటిని అందించే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించినా,ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చేందుకు మరో మూడేళ్లు పట్టనుంది. మొత్తంగా నల్లగొండ జిల్లాలో దాదాపు 2.60లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందించాల్సిన అనివార్య పరిస్థితి ఏఎమ్మార్పీకి మరో మూడేళ్ల పాటు తప్పదు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు నిర్వహణలో ఇబ్బందుల్లేకుండా చూడాలనే సూచనలు సర్వత్రా వస్తున్నాయి.

కొనసాగుతున్న సివిల్ పనులు

సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టు వద్ద సంపు పనుల్లో బ్రేక్ పడినా, ఇతర పంపుహౌస్ నిర్మాణపనులు, పంప్ హౌస్ స్ట్రక్చర్ పనులు, పంపింగ్ మెయిన్ పనులు, సబ్ స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తర భారతదేశానికి చెందిన దాదాపు 300 మందికి పైగా కార్మికులు, మెగా కంపెనీకి చెందిన ఇంజనీర్లు, నాన్‌టెక్నికల్ సిబ్బంది ఇక్కడ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులు వేగంగా సాగినా, కీలకమైన సంపు పనులు పూర్తయితే తప్ప ప్రాజెక్టు కొలిక్కిరాని పరిస్థితి ఉంది.



పనులు సాగాలంటే సాగర్‌లో

నీటిమట్టం తగ్గాల్సిందే..

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఆనుకొని సుంకిశాల వద్ద ఇన్‌టేక్‌వెల్ నిర్మిస్తున్నారు. ఇక్కడ సంపు, మూడు టన్నెళ్ల నిర్మాణాలతో పాటు, పంపుహౌస్, పంపుహౌస్ సూపర్ స్ట్రక్చర్ నిర్మిస్తున్నారు. అందులో టన్నెళ్లు, వాటిపై సైడ్‌వాల్స్ నిర్మిస్తున్నారు. మొత్తం రిజర్వాయర్ లెవల్‌కు సమాంతరంగా 180 మీటర్ల ఎత్తు, ఆపైన సంపుఫ్లోర్ లెవల్‌కు మరో 137మీటర్ల ఎత్తుకు నిర్మాణాలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం ప్రమాదంలో సైడ్‌వాల్ కూలిపోవడంతో ఆ గోడను పూర్తిగా దిగువనుంచి మళ్లీ నిర్మించాల్సి ఉంటుంది. ఆ ఒక్క గోడ నిర్మాణమే గాక, ప్రమాదంలో టన్నెల్‌కు రిజర్వాయర్ వైపున ఉన్న గేటు తెరుచుకోవడంతో సంపులోకి నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటిని తీయాలంటే సాగర్ రిజర్వాయర్‌లో ఈ గేటు లెవల్‌కంటే దిగువకు నీటిమట్టం పడిపోవాలి. అంటే దాదాపు డెడ్‌స్టోరేజీ పరిస్థితి ఏర్పడాలి. నిర్మాణ సంస్థ ప్రతినిధులు రెండు నెలల్లో ఈ సంపులో కూలిన సైడ్‌వాల్ పనులు ప్రారంభిస్తామని చెబుతున్నా, వాస్తవానికి రిజర్వాయర్‌లో నీరు తగ్గాలంటే కనీసం ఫిబ్రవరి వరకు ఆగాలి. డెడ్‌స్టోరేజీకి నీరు పడిపోకపోయినా, నదిలో టన్నెల్స్ వైపునీరు రాకుండా మళ్లించే నిర్మాణం చేపట్టాలన్నా కనీస నీటిమట్టానికి చేరువవ్వాలి. అది జరగాలన్నా కనీసం ఫిబ్రవరి వరకు వేచి ఉండకతప్పదని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంకూడా సంపు పనుల వేగవంతాన్ని ప్రభావితం చేస్తుందని, మొత్తంగా ఈ వివాదమంతా ముగిసి, పనులు ముందుకు సాగేందుకు వేసవి వరకు వేచి ఉండక తప్పని పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది.



సాగునీటి వనరుల ఆధారంగా జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులకు ప్రభుత్వం ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా, ఈ పథకాన్ని కొనసాగిస్తుందా? లేదా అనే సందిగ్ధం ఉంది. అయితే గతం మాదిరిగానే మత్స్యకారులకు 100శాతం సబ్సిడీపై చేపపిల్లలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

- (ఆంధ్రజ్యోతి, యాదాద్రి)

చేపపిల్లల పంపిణీకి

సన్నాహాలు

» టెండర్ల ప్రక్రియ షురూ » గతంలో మాదిరిగా ఉచితంగా పంపిణీ » జిల్లాలో 650 చెరువుల్లో 3కోట్ల పిల్లలు

సాధారణంగా మే నుంచి జూన్ మొదటి వారంలోగా చేప పిల్లల పంపిణీకి టెండర్ల ప్రక్రియ పూర్తికావాలి. ఇటీవల ప్రభుత్వం జిల్లా యంత్రాంగం నుంచి చేపల పిల్లల పంపిణీపై నివేదికలు కోరింది. ఆగస్టులోగా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. ఈ మేరకు మంగళవారం జిల్లాలో చేపపిల్లల పంపిణీపై టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. తొలుత టెక్నికల్ టెండర్లు ప్రారంభిస్తారు. ఈ టెండర్లలో కోట్ చేసిన కంపెనీల పరిధిలోని సీడ్ నాణ్యతను పరిశీలించి,ఆ తరువాత టెండర్లను ఖరారు చేస్తారు. అనంతరం ఫైనాన్స్ టెండర్‌ను ప్రారంభిస్తారు. చేపపిల్లల పంపిణీని ఏ కంపెనీ తక్కువ ధరకు కోట్ చేస్తుందో, ఆ కంపెనీకి సీడ్ పంపిణీ బాధ్యతలను అప్పగించనున్నారు. ఈ ఏడాది వానాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. జిల్లాలోని 17 మండలాల్లోనూ ఓ మోస్తారు వర్షాలు కురిశాయి. భారీ వర్షాలు కురిసిన పక్షంలో చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో మొత్తం 1,050చెరువులు, కుంటలు ఉన్నాయి. జిల్లాయంత్రాంగం గుర్తించిన చెరువుల్లో చేప పిల్లలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 650చెరువులతో పాటు 22 మూసీ పరివాహక ప్రాంతాల్లోని కుంటల్లో చేపపిల్లలను వదిలేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు.

చేపపిల్లల పంపిణీపై టెండర్లు ప్రారంభమయ్యాయి



మత్స్యకారులకు ఉచితంగా చేపల పిల్లల పంపిణీపై ప్రభుత్వ ఆదేశాల మేరకు టెండర్లు ప్రారంభమయ్యాయి. మొదటగా టెక్నికల్, అనంతరం ఫైనాన్స్ టెండర్ల ప్రక్రియ ఉంటుంది. టెండర్ దక్కించుకున్న కంపెనీ జిల్లాకు చేపపిల్లలను పంపిణీ చేస్తుంది. ఈ ఏడాది జిల్లాలో 650చెరువుల్లో 3కోట్ల చేపపిల్లలను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపాం. ఆగస్టు వరకు వర్షాకాలం ఉంటుంది. చెరువుల్లో నీటి నిల్వల మేరకు చేప పిల్లలను పంపిణీ చేస్తాం.

- రాజారాం, జిల్లా మత్స్యశాఖ అధికారి

3కోట్ల చేపపిల్లల పంపిణీ

జిల్లాలో ఈసారి 3కోట్ల చేప పిల్లలను పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మొత్తం 650 చెరువుల్లో చేప పిల్లలను వదలనున్నారు. ఈసారి కూడా చెరువుల్లో నీటినిల్వలను బట్టి చేప పిల్లలను పంపిణీ చేయనున్నారు. జిల్లాలో మొత్తం 171 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు, 15 మహిళా మత్స్యపారిశ్రామిక సంఘాలు, ఒక మత్స్య పారిశ్రామిక మార్కెటింగ్ సహకార సంఘం ఉంది. ఈ సంఘాల్లో మొత్తం 10,345 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. వీరంతా చేపలు, రొయ్యలను విక్రయించి జీవనం గడిస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా చేపల పంపిణీపై నిర్ణయం తీసుకోవడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతుల మాదిరిగానే మత్స్యకారులు కూడా భారీ వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు చిరుజల్లులతో కూడిన వర్షాలే కురిశాయి. ఇప్పటివరకు జిల్లాలో 15 చెరువుల్లోకి మాత్రమే పూరిస్థాయి నీరు చేరింది. 17మండలాలకు 13మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా, చౌటుప్పల్, యాదగిరిగుట్ట, గుండాల, ఆత్మకూరు మండలాల్లో సాధారణం కంటే కూడా తక్కువగా వర్షపాతం నమోదైంది. ఆగస్టు చివరి వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. కిలో సైజు చేపలు పెరగాలంటే కనీసం ఆరు నెలలు సమయం పడుతుంది. భారీ వర్షాలు కురవగానే చేపలు పంపిణీ చేసినపక్షంలో పెరుగుదల ఉంటుంది. ఆలస్యమైన పక్షంలో చేపలు తక్కువ సైజులో ఉండే అవకాశం ఉందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది జిల్లాలోని 706 చెరువుల్లో 2,78,72,771 చేపపిల్లలను, 41 చెరువుల్లో 38.20లక్షల రొయ్యపిల్లలను అధికారులు వదిలారు.

సొసైటీల అభివృద్ధికి సమష్టి కృషి

డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

భువనగిరి రూరల్, ఆగస్టు 13: సొసైటీల అభివృద్ధికి సమష్టి కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరిలో జిల్లా పరిధిలోని పీఏసీఎస్ చైర్మన్లు, జిల్లా ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్లు, సొసైటీ సీఈవోలతో రీజినల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా ఎన్‌డీసీసీ బ్యాంకులు, సొసైటీలు మెరుగైన సేవలందిస్తున్నాయన్నారు. రూ.లక్ష నుంచి రూ.లక్షా 50వేల వరకు పెంచుతూ స్వల్పకాలిక రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రుణమాఫీ పథకంలో భాగంగా మొదటి విడతలో రూ.143కోట్లు, రెండో విడతలో రూ.97కోట్లు మాఫీ చేశామని, మూడో విడతలో మరో రూ.226కోట్లు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ జరగని రైతులకు కూడా రుణమాఫీ చేస్తామని, ఎలాంటి అపోహలకు గురికావొద్దని సూచించారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ పథకం అమలు చేస్తామన్నారు. దీర్ఘ, స్వల్పకాలిక రుణాలకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రూ.2500 కోట్ల టర్నోవర్ సాధించి రాష్ట్రంలోనే ఉమ్మడి నల్లగొండ జిల్లా 3వ స్థానంలో నిలిచిందన్నారు. ప్రతీనెల పీఏసీఎస్ చైర్మన్లు, బ్యాంకు మేనేజర్లు సమావేశం నిర్వహించి రైతులకు సంబంధించిన పలు పథకాలపై సమీక్షించాలన్నారు. సొసైటీలను తనిఖీ చేస్తానని, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీఈవోలపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం భువనగిరి గాంధీ పార్కు ఎదురుగా గల డీసీసీబీ బ్యాంకు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్లు అందెల లింగం యాదవ్, మొగిలిపాక రామచంద్రయ్య, పీఏసీఎస్ చైర్మన్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నోముల పరమేశ్వర్ రెడ్డి, డీసీసీబీ సీఈవో ఆర్ శంకర్ రావు, జిల్లా రిజిస్ట్రార్ డి.హరిణి, ఏజీఎం ఉదయశ్రీ, పీఏసీఎస్ చైర్మన్లు, సొసైటీ సీఈవోలు, సిబ్బంది ఉన్నారు.

ఉండాలా? ఇక్కడి నుంచి వెళ్లాలా?

» ఇళ్ల చుట్టూ మురుగు కాల్వలు.. వెదజల్లుతున్న దుర్గంధం
» కాలనీవాసుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్న పరిసరాలు
» సమస్యలకు నిలయంగా హౌసింగ్ బోర్డు కాలనీ



హెచ్‌బీ కాలనీలోని ఓ రహదారిపై పారుతున్న మురుగు నీరు

భువనగిరిటౌన్, ఆగస్టు 13: ఈ కాలనీకి ఎంతో చరిత్ర ఉంది. అయినా దానిఆలనా, పాలనా చూసేవారే లేరు. ఇళ్ల చుట్టూ కంపు కొడుతున్నా,కాలనీవాసులు అనారోగ్యం బారిన పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. అదే హౌసింగ్ బోర్డు కాలనీ.. జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో అభివృద్ధి చెందిన కాలనీలలో ఒకటి. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం అప్పటి ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు సొసైటీ అప్పటి అవసరాలకు అనుగుణంగా వందశాతం లేఅవుట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ విధానంలో హౌసింగ్ బోర్డు కాలనీని నిర్మించింది. రుణ సౌకర్యం కూడా ఉండడంతో అధికమంది ప్రభుత్వ ఉద్యోగులే అప్పట్లో కాలనీలోని ఇళ్లను కొనుగోలుచేశారు. దీంతో అప్పట్లో హౌసింగ్ బోర్డు కాలనీ భువనగిరికి ల్యాండ్‌మార్క్‌గా ఉండేది. కానీ క్రమేపీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శిథిలావస్థకు చేరడం, మరమ్మతులు, పునర్నిర్మాణంలో అధికారులు చూపిన నిర్లక్ష్యానికి తోడు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ నిర్వహణలో కాలనీవాసులు చూపిన అలసత్వం కారణంగా నేడు ఆ కాలనీ దుర్గంధభరితంగా మారింది. కాలనీలోని సుమారు అన్ని రహదారులపై డ్రైనేజీ నీరు పారుతుండడం, కొద్దిపాటి వర్షాలకు మురుగునీరు ఇళ్లలోకి చేరుతుండడం నిత్యకృత్యమైంది. ఫలితంగా హౌసింగ్ బోర్డుకాలనీఅంటేనే సమస్యలకు నిలయమని ప్రచారంలోకి వచ్చింది.

దుర్గంధభరితం, రహదారులపై మురుగునీరు

1987లో 6.20ఎకరాల విస్తీర్ణంలో 422గృహాల నిర్మాణం లక్ష్యంగా హౌసింగ్‌బోర్డు కాలనీని అప్పటి ఏపీ హౌసింగ్ బోర్డు సొసైటీ నిర్మించింది. గృహ నిర్మాణం, అప్పగింత పూర్తయ్యాక కాలనీవాసుల వినతి మేరకు 1997లో కాలనీ నిర్వహణ బాధ్యతలను భువనగిరి మునిసిపాలిటీకి అప్పగించింది. అయితే కాలనీ నిర్మాణ సమయంలో అప్పటి గృహ అవసరాల మేరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించి ఒక ఎస్‌టీపీని నిర్మించారు. కానీ కాలక్రమంలో కాలనీ విస్తరించి అప్పటి నుంచి గృహాలన్నింటినీ తొలగించి సుమారు 1600నూతన గృహాలతోపాటు బహుళ అంతస్థుల భవనాలు నిర్మించడంతోపాటు కాలనీలో నివసించే వారి సంఖ్య సుమారు 6వేలకు చేరింది. అయినప్పటికీ 37 ఏళ్ల క్రితం నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైపులైన్లను నేటి అవసరాలకు అనుగుణంగా మార్చలేదు. అంతేగాక కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న, నిర్మించిన అధిక శాతం గృహాల్లో సెప్టిక్ ట్యాంక్‌లు నిర్మించలేదు. అలాగే పలువురు కాలనీవాసులు ఇళ్లలో ఉత్పత్తి అయ్యే చెత్తను ఇళ్లలోని డ్రైనేజీలలో పారవేస్తుండడంతో ఆ వ్యర్థాలన్నీ అండర్ గ్రౌండ్ డ్రైనేజీలోకి చేరుతున్నాయి. కొంతమంది మాంసం విక్రయించే వ్యాపారులు కూడా వ్యర్థాలను అండర్ గ్రౌండ్ డ్రైనేజీలలోని వదిలేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే సుమారు 15 కిలోమీటర్లపాటు ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవుట్‌లైన్ తరచూ మూసుకుపోతోంది. అదే సమయంలో తాగునీటి పైపులైన్, ఇతర అభివృద్ధి పనులు, శానిటేషన్ పనులకోసం కాలనీలో పలుమార్లు తవ్వకాలు జరిపారు. భవన యజమానులు కూడా కనెక్షన్‌కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఇష్టానుసారంగా తవ్వారు. ఫలితంగా అప్పటికే శిథిలావస్థలో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరింత ధ్వంసమైంది. దీంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలో మురుగునీరు సక్రమంగా ప్రవహించక జామ్ అవుతూ పైపులైన్ ధ్వంసమైన, బలహీనంగా ఉన్నచోట, మ్యాన్ హోల్స్‌నుంచి మురుగు వెలుపలికి వస్తోంది. ఓపెన్ డ్రైనేజీలు లేకపోవడంతో వర్షం నీరు మురుగునీటితో కలిపి కాలనీలోని లోతట్టు ప్రాంతాల వైపు ప్రవహిస్తూ ఇళ్లలోకి చేరుతోంది. దోమలు స్వైర విహారం చేస్తుండడంతో పాటు కాలనీ మొత్తం దుర్గంధభరితమవుతోంది. ఫలితంగా కాలనీవాసుల ఆరోగ్యాలపై పెను ప్రభావం చూపుతోంది.

ఇంట్లో ఉండలేక పోతున్నాం



ఇంటిముందు నిరంతరంగా పారుతున్న మురుగునీటితో ఇంట్లో ఉండలేకపోతున్నాం. ఇంటి నుంచి పనులకోసం వెలుపలికి వెళ్లాలంటే మురుగు నీటిలోనే నడవాల్సిన దుస్థితి. నిరంతరంగా వస్తున్న దుర్గంధం, దోమల వ్యాప్తితో కాలనీవాసుల ఆరోగ్యాలపై పెను ప్రభావం చూపుతోంది. సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు, నాయకులు శ్రద్ధ చూపాలి. లేదంటే మేము ఇళ్లను వదిలేసి వెళ్లాల్సి వస్తుంది.

- చల్లగురుగుల అనురాధ, హెచ్‌బీ కాలనీ, భువనగిరి.

సమస్యలు పరిష్కరిస్తాం



హెచ్‌బీ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తాం. అర్థాంతరంగా నిలిచిన మరమ్మతు పనులను పూర్తిచేయాలని వెంటనే ప్రజారోగ్య శాఖకు లేఖ రాస్తాం. అవసరమైన మరమ్మతులకు దఫాలవారీగా నిధుల కేటాయింపునకు ప్రయత్నిస్తాం. ప్రస్తుత మురుగునీటి సమస్య పరిష్కారానికి కాలనీలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం.

- రామాంజుల్‌రెడ్డి, కమిషనర్, భువనగిరి మునిసిపాలిటీ

నిలిచిన మరమ్మతు పనులు

కాలనీలో మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా రూ.3కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి మరమ్మతులు చేయాలని కొంతకాలంగా డిమాండ్ ఉంది. ఈ మేరకు ఏడాది క్రితం మంజూరైన రూ.కోటితో ప్రజారోగ్య శాఖ పర్యవేక్షణలో మూడు మాసాల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. కానీ కొద్దికాలానికే పనులు అర్థాంతరంగా నిలిచాయి. పనుల కొనసాగింపు, పర్యవేక్షణలో ప్రజారోగ్యశాఖ, మునిసిపల్ మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు స్థానికంగా ప్రచారంలో ఉంది. సమస్య శాశ్వత పరిష్కారం కోసం రూ.కోటితో ప్రారంభమైన పనులు వెంటనే పూర్తి చేసి మరో రూ.2కోట్లను ప్రభుత్వం మంజూరు చేస్తేనే కాలనీవాసుల ఆరోగ్యాలకు భద్రత ఉంటుందని స్థానికులు అంటున్నారు. అంతేగాక వర్షంనీరు అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి చేరేలా సక్రమంగా మ్యాన్ హోల్స్‌ను నిర్మించాలని స్థానికులు అంటున్నారు.

విద్యార్థుల భద్రతకు పొంచి ఉన్న ముప్పు

» పరిశీలించిన జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ బృందం » 'వసతి గృహ హింస' కథనానికి స్పందన



సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో భోజన నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తులు

భువనగిరి టౌన్, ఆగస్టు 13: భువనగిరిలోని గురుకుల పాఠశాలలో విద్యార్థుల భద్రతకు ముప్పు పొంచి ఉందని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ బృందం సభ్యులు ఆందోళన వ్యక్తంచేశారు. 'వసతి గృహ హింస' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రధాన సంచికలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర న్యాయసేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు న్యాయసేవా అధికార సంస్థ స్పందించింది. ఈ మేరకు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ బృందం సభ్యులు మంగళవారం సాయంత్రం సమయంలో పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, పాఠశాల, డార్మెటరీ భవనాలను జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇన్‌చార్జి కార్యదర్శి, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వి.మాధవిలత, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.నాగేశ్వర్‌రావు పరిశీలించారు. విద్యార్థులు, అందుబాటులో ఉన్న ఉపాధ్యాయులతో మాట్లాడారు. భోజనంలో నాణ్యత లోపించిందని పరిశుభ్రత లోపభూయిష్టంగా ఉన్నదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో పెరిగిన చెట్ల పొదలతో పాములు వచ్చే అవకాశాలు ఉన్నాయని న్యాయమూర్తులు గుర్తించారు. పెచ్చులు ఊడుతున్న పైకప్పు, వర్షాలతో శిథిలావస్థలో ఉన్న భవనాలు కూలే ప్రమాదాలు ఉండడంతో విద్యార్థుల భద్రతకు ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వసతుల మెరుగుకు సత్వర చర్యలు తీసుకోవాలని సంక్షేమ, విద్యా శాఖలకు, జిల్లా పాలనా యంత్రాంగానికి సూచించారు.

చేనేత సమస్యలపై నివేదిక రూపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత రాష్ట్ర నాయకుడు తడక వెంకటేష్

చేనేత సంఘం రాష్ట్రనేత తడక వెంకటేష్

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 13: చేనేత సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా చేనేత ప్రతినిధులు సమష్టిగా ఒక నివేదికను రూపొందించాలని చేనేత సంఘం రాష్ట్ర నేత తడక వెంకటేష్ అన్నారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి చేనేత టైఅండ్‌డై సిల్కు చీరల ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాల చేనేత ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన తడక వెంకటేష్ మాట్లాడారు. పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రోత్పత్తులకు జాతీయ స్థాయి గుర్తింపు లభించిందన్నారు. అయితే ప్రభుత్వం కల్పించిన పేటెంట్ హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని నివేదించాలన్నారు. పోచంపల్లి ఇక్కత్ డిజైన్లను మిల్లు యజమానులు ప్రింట్ చేయడం వల్ల తీవ్ర నష్టం కలుగుతుందని, ప్రింటింగ్‌ను అరికట్టాలన్నారు. సమావేశానికి చేనేత కేంద్రాలైన పోచంపల్లి, కొయ్యలగూడెం, చౌటుప్పల్, పుట్టపాక, గట్టుప్పల్, చండూరు, ఎల్లంకి, సిరిపురం, ఆలేరు, బచ్చన్నపేట, గౌరాయిపల్లి, జనగాం. గూడూరు తదితర ప్రాంతాల చేనేత ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో కర్నాటి వెంకటేశం, తడక రమేష్, కందగట్ల భిక్షపతి, కర్నాటి బాలరాజు, కొండల్‌రావు, గడ్డం జయశంకర్, వడ్డేపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి రమణి



సదస్సులో మాట్లాడుతున్న నోడల్ అధికారి రమణి

భువనగిరి టౌన్, ఆగస్టు 13: పిల్లల శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికి తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇవ్వాలని ఇంటర్ నోడల్ అధికారి సీహెచ్ రమణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రీతిస్వరూప్ అన్నారు. మంగళవారం భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం, ఒత్తిడి నివారణ సదస్సులో వారు మాట్లాడారు. మానసిక ఒత్తిళ్లను అధిగమిస్తేనే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటూ చదువుపై శ్రద్ధచూపి, ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. సెల్‌ఫోన్, కంప్యూటర్లు, మాదకద్రవ్యాలు, వ్యసనాలకు దూరంగా ఉంటే మానసికంగా ప్రశాంతంగా ఉండవచ్చునని సూచించారు. పరీక్షల భయాన్ని వీడాలని, మానసిక సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెం.14416ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.పాపిరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఇస్తారి, డాక్టర్ బషీరొద్దీన్, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్ హమీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర సమరయోధుల ఫొటో ఎగ్జిబిషన్

భువనగిరి అర్బన్, ఆగస్టు 13: దేశ స్వాతంత్ర వేడుకల్లో భాగంగా స్వాతంత్య్ర సమర యోధులకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ జి.కోటేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో ఫొటో ఎగ్జిబిషన్ జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. తెలంగాణ ప్రాంతం నుంచి స్వాతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సమరయోధుల ఛాయాచిత్రాలు ప్రదర్శించనున్నట్లు, ఈ వేడుకల సందర్భంగా వ్యాస రచన పోటీలు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

గుర్రంపోడు, ఆగస్టు 13: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ఆమలూరు గ్రామంలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండా రామ చంద్రం (43) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామచంద్రంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళపై దాడి .. నిందితులపై హత్యాయత్నం కేసు

చిలుకూరు, ఆగస్టు 13: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో మహిళపై మంగళవారం కత్తితో దాడి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన దొంగరి సంధ్య తన తల్లిగారి గ్రామమైన ఆర్లెగూడేనికి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆరె.సైదాబాబు సంధ్యను వెనుక నుంచి వచ్చి కత్తితో దాడిచేశాడు. దీంతో చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంధ్య తండ్రి ఆరె బసవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెల మృతి

శాలిగౌరారం, ఆగస్టు 13: కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకుల పహాడ్ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన మేకల కాపరి గోళ్ల సైదులు సోమవారం రాత్రి గొర్రెలను మందలో తోలాడు. అయితే అర్ధరాత్రి వేళ కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.50వేల విలువైన గొర్రెలు మృతి చెందాయని బాధితుడు సైదులు తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

రామన్నపేట, ఆగస్టు 13: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంల గ్రామానికి చెందిన బిజ్జాల రాంబాబు తన కారులో రూ.10వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్‌ఐ పి. మల్లయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం



అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న తిరుమల్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 13: తెలంగాణ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లికి చెందిన ఎన్ఆర్ఐ, వ్యాపారవేత్త మునుకుంట్ల తిరుపతిరెడ్డి అన్నారు. అమెరికాలో వ్యాపారవేత్తగా కొనసాగుతున్న మునుకుంట్ల తిరుమల్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం స్వాగతం పలికారు. అనంతరం ఆయన సీఎంతో మాట్లాడినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల తరఫున సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులు పూర్తిచేసి నిధులు కేటాయించాలని, అందుకుగాను ఎన్ఆర్ఐలు తమవంతు ఆర్థిక సహాయం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించినట్లు పేర్కొన్నారు. ఆయనవెంట రాష్ట్రానికి చెందిన ఎన్ఆర్ఐలు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

● ఏడుగురి నిందితుల అరెస్టు ● 31తులాల బంగారం, కిలో వెండి, రూ.28వేలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్రపవార్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ, ఆగస్టు 13: తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పక్కా సమాచారం మేరకు ప్రత్యేక బృందాల సభ్యులు మంగళవారం ఉదయం 9గంటలకు అనిశెట్టిదుప్పలపల్లి ఎక్స్ రోడ్డులో వాహనాలు చేశారు. అదే సమయంలో మిర్యాలగూడ వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరిని ఆపి విచారించారు. ఈ విచారణలో వారు పెద్దసూరారం గ్రామపరిధిలో జూలై 30వ తేదీన పగటిపూట ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వెంటనే వారిని మరింత విచారణ చేయడంతోపాటు స్కూటీని తనిఖీ చేయగా, చోరీ చేసిన బంగారు అభరణాలు, నేరాలకు ఉపయోగించే ఇనుపరాడ్డు లభ్యమయ్యాయి. ఆభరణాలను మిర్యాలగూడలో విక్రయించేందుకు వెళుతున్నట్లు ఇద్దరు నిందితులు తెలిపారు. పట్టుబడిన నేరస్తులు ఇచ్చిన సమాచారంమేరకు ముఠాలోని నలుగురి సభ్యులను చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో, మరో నిందితుడిని వలిగొండలో అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నేరస్తులందరినీ విచారించగా, వారంతా ఒక ముఠాగా ఏర్పడి నల్లగొండ జిల్లాతోపాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలో మొత్తం 12నేరాలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ నేరాల్లో మొత్తం రూ.23.53లక్షల విలువైన 31తులాల బంగారం, కిలో వెండి ఆభరణాలు, రూ.28వేల నగదుతోపాటు నేరాలకు ఉపయోగించిన స్కూటీ, ఇనుపరాడ్డును, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన గుండెబోయిన మహేష్, అదే గ్రామానికి చెందిన గుండెబోయిన మల్లేష్‌తోపాటు నూతి సతీష్, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన బొడిగ అశోక్, చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన బైరబోయిన స్వామి, అదే గ్రామానికి చెందిన గుండెబోయిన చంద్రం, బడే బాలకృష్ణ ఉన్నారు. దొంగల ముఠాలో మరొక సభ్యుడు పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు మినహా మిగతా వారంతా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామానికి చెందిన వారన్నారు. వీరిలో గుండెబోయిన మహేష్, గుండెబోయిన మల్లేష్ మినహా మిగతా వారు పాత నేరస్తులని, వీరిపై గతంలో నల్లగొండ, జనగామ, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. ముఠా సభ్యులను పట్టుకోవడం కీలకంగా వ్యవహరించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్ రెడ్డి, శాలిగౌరారం ఇన్‌స్పెక్టర్ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ డి.రాజు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, లింగారెడ్డి, వహీద్‌పాషా, రాము, శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకోసం

దరఖాస్తుల ఆహ్వానం

● వచ్చే నెల 5వ తేదీలోపు అందజేయాలి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 13: జిల్లాలోని పలు దేవాలయాల్లో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకోసం సెప్టెంబరు 5వ తేదీ వరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ ఏసీ అన్నెపర్తి సులోచన తెలిపారు. మంగళవారం ఆమె జిల్లా కేంద్రంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నల్లగొండలోని తులసీనగర్ భక్తాంజనేయ, శేర్‌బంగ్లా సంతోషిమాతా దేవాలయం, శ్రీనగర్ కాలనీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం, పానగల్లు ఛాయాసోమేశ్వర స్వామి ఆలయం, మారేపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోపలాయపల్లి శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం, చింతపల్లి మండలం మాదనపురం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, కట్టంగూరు మండలంలోని కురుమర్తి కోదండరామచంద్రస్వామి దేవాలయం, మాడ్గులపల్లి మండలం శ్రీవేణుగోణపాలస్వామి దేవస్థానం, కేతేపల్లి మండంల బండేపాలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, అన్నెపర్తి గ్రామం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానకు సంబంధించి నూతన మండలి ఏర్పాటు కోసం అర్హులైన వారు దరఖాస్తు హైదరాబాద్ దేవాదాయ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

భువనగిరిలో నకిలీ సర్టిఫికెట్ల తయారీ

● పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

● హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు అందజేత

భువనగిరి టౌన్, ఆగస్టు 13: నకిలీ సర్టిఫికెట్లు తయారుచేస్తూ హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు అందజేసిన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానిక సమ్మద్ చౌరస్తాలో ఏ టూ జెడ్ కమ్యూనికేషన్ పాయింట్ ఆన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడైన అబ్దుల్లా అలియాస్ గణేష్‌ను, కార్తీక్ బుక్ బైండింగ్ వర్క్స్, రబ్బర్ స్టాంప్స్ నిర్వాహకుడైన మరికుక్కల గిరిని ఆదివారం రాత్రి ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఎస్ఓటీ పోలీసులు ఆ రాత్రంతా విచారించాక సోమవారం తెల్లవారుజామున భువనగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు సోమవారం అబ్దుల్లా, గిరి దుకాణాలు, ఇళ్లలో తనిఖీలు చేసి పేరు మార్చిడి పత్రాలు, హార్డ్‌డిస్కులను స్వాధీనం చేసుకున్నారు. లభించిన వివరాల ఆధారంగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే అబ్దుల్లా నకిలీపత్రాలను తయారు చేయగా, అందుకు అవసరమైన స్టాంపులను గిరి తయారుచేశాడని, ఈ ముఠాలో మరికొంతమంది నిందితులు కూడా ఉన్నట్లు ప్రచారమవుతోంది. వీరిద్దరినీ కోర్టులో హాజరుపరిచాక పూర్తి వివరాలను మీడియాకు తెలియజేస్తామని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల వారికి ఈ ముఠా ఫేక్ సర్టిఫికెట్లను తయారు చేసి ఇచ్చినట్లు ప్రచారమవుతోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చౌటుప్పల్ రూరల్, కొండమల్లేపల్లి, ఆగస్టు 13: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఒకరు, నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో మరొకరు దుర్మరణం చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారు జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారుజుమున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బొర్నకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దుడ్డ గురువయ్య(42) హైదరాబాద్ రహమత్‌నగర్‌లో కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తుంటాడు. విజయవాడలో బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి డీసీఎంలో హైదరాబాద్ వస్తుండగా ముందుగా వెళ్తున్న లారీని డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో గురువయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో కారు ఢీకొని ఒకరు మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్ కుమార్(38) మండలకేంద్రంలో ఉంటూ తాపిమేస్త్రిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జడ్చర్ల-కోదాడ హైవేపై చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని ఓ దాబా వద్ద భోజనం చేసి రోడ్డుదాటుతుండగా రమావత్ భిక్షనాయక్ అనే వ్యక్తి కారును అతివేగంగా నడిపి రాజ్‌కుమార్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగు

● బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం ● యాదాద్రి భువనగిరి జిల్లా తుమ్మలగూడెంలో ఆటో డ్రైవర్ కుటుంబం దాతృత్వం



రాస అశోక్(ఫైల్)

రామన్నపేట, ఆగస్టు 13: ఓ ఆటోడ్రైవర్ తాను మృతి చెంది, అవయవ దానంతో నలుగురు జీవితాల్లో వెలుగు నింపాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన రాస అశోక్(39) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన తన బావమరుదులతో కలిసి సిద్దిపేటకు డీజే బాక్సుల కోసం వెళ్లి, వాటిని కొనుగోలు చేసి టాటా ఏస్ వాహనంలో తీసుకొస్తుండగా, గజ్వేల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో డ్రైవర్ బ్రేక్ వేశాడు. వాహనం వెనుక భాగంలో కూర్చున్న అశోక్, ఇద్దరు బావమరుదులు ఒక్కసారిగా కిందపడ్డారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా, రాస అశోక్ తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అశోక్ భార్య లలిత, యశోద ఆస్పత్రి ద్వారా అశోక్ నేత్రాలు, కాలేయం, కిడ్నీలు, గుండెను దానం చేశారు. ఇంటిపెద్ద మృతి చెందినా ఆయన అవయవాలు దానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపటంతో కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. అశోక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. స్వగ్రామం తుమ్మలగూడెంలో మంగళవారం అశోక్ అంత్యక్రియలు నిర్వహించారు. అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లానేత పూస బాలకిషన్ కోరారు.

నేటి నుంచి యాదగిరీశుడి పవిత్రోత్సవాలు

● మూడు రోజులపాటు కొనసాగనున్న వేడుకలు ● ఏర్పాట్లు చేసిన దేవస్థాన అధికారులు ● రేపు, ఎల్లుండి నిత్య కల్యాణం, సుదర్శనహోమం రద్దు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 13: యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్ రావు తెలిపారు. ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే పూజల్లో దొర్లిన దోషాల నివారణకు వైష్ణవ, శైవ ఆలయాల్లో పవిత్రోత్సవాలు జరపడం సంప్రదాయమని ఆలయ ప్రధానార్చకుడు కాండూరి వెంకటాచార్యులు చెప్పారు. మూడు రోజులపాటుసాగే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ మొదటి రోజు ఉదయం ప్రతిష్ఠామూర్తులకు విశేష అభిషేకం, సాయంత్రం స్వస్తివాచనం, అంకురార్పణ, రక్షాబంధనం, 15న రెండోరోజు అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర అధివాసం, మూలమంత్ర హోమాలు, నిత్య పూర్ణాహుతి, సాయంత్రం సుదర్శన చక్రానికి ఆరాధన, ఆవాహన చేసి అభిషేకించి పూలమాల (ఇది ఏటా ఒకరోజే) వేస్తారు. మూడో రోజైన 16వ తేదీన స్వామివారికి మహాపూర్ణాహుతి, పవిత్ర సమర్పణ, మహాకుంభప్రోక్షణ, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పవిత్రోత్సవాలు పాతగుట్ట ఆలయంలో కొనసాగుతాయన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహోత్సవం, లక్ష పుష్పార్చన, సుదర్శనహోమం రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 13,78,242 ఆదాయం సమకూరింది.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.36,59,950

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు 60 రోజులకు మొత్తం రూ.36,59,950 వచ్చినట్లు ఈవో సిరికొండ నవీన్ కుమార్ తెలిపారు. గుట్టపైన ప్రధానాలయంతోపాటు ఉపాలయాల వద్ద ఉన్న హుండీలను లెక్కించగా రూ.32,08,490 రాగా, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.4,51,460 కలిపి మొత్తం రూ.36,59,950 సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ డివిజన్ పర్యవేక్షకురాలు బీ.సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



కేంద్రమంత్రికి తీర్థం అందజేస్తున్న అర్చకుడు

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఆంజనేయస్వామి దేవాలయంలో కొలువైన స్వామిని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం దర్శించుకున్నారు. పూరోహితులు వల్లూరి నిఖిల్ శర్మ, వల్లూరి భానుప్రకాష్‌శర్మ, ఆలయ ఈవో నవీన్‌కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్‌కుమార్

రాజాపేట, ఆగస్టు 13: విద్యార్థులు సైబర్‌క్రైం, డ్రగ్స్‌పై అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని యాదగిరిగుట్ట ఏసీపీ రమేష్ కుమార్ కోరారు. సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ నివారణపై వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో మండలం రఘునాథపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐలు రమేష్, కొండల్‌రావు, ఎస్ఐ ఉపేందర్‌యాదవ్, నాయకులు బొడిగె పెంటయ్య గౌడ్, శంకర్, యాదేశ్, హెచ్‌ఎం మనోజ్‌కుమార్, మధుకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

కాల్వల పెండింగ్ పనులు పూర్తిచేయాలి : సీపీఐ

వలిగొండ, ఆగస్టు 13: గంధమల్ల రిజర్వాయర్, బునాదిగాని, భీమలింగం కాల్వల పెండింగ్ పనులను పూర్తిచేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు డిమాండ్‌చేశారు. మండలకేంద్రంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూసీ ప్రక్షాళన చేపట్టాలన్నారు. గంధమల్ల రిజర్వాయర్ తాగునీరు అందించాలన్నారు. వ్యవసాయ రుణాల కోసం బ్యాంకులు ఆభరణాలు తాకట్టుపెట్టి అప్పు తీసుకున్న రైతుందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమవేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, నాయకులు బోడ సుదర్శన్, యాదయ్య, మల్లేశం, అంజయ్య, వీరాస్వామి, సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, రవీందర్, మహేష్ పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

భువనగిరి రూరల్, ఆగస్టు 13: పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాల అమలుకు కృషిచేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి అన్నారు. జిల్లాపరిషత్ కార్యాలయ సమావేశ హాల్‌లో పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి. శ్రీకాంత్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎ. విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కె. శ్రీనివాస్‌రెడ్డి, కె. జయశ్రీ, కె. శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా హరిశివకుమార్, జాయింట్ సెక్రటరీలుగా అపర్ణ, సంతోష్, పావని, ఆర్గనైజేషన్ సెక్రటరీలుగా కె నాగరాజు, నాగజ్యోతి, ఎంకర్ల సారంగపాణి, కోశాధికారిగా రమేశ్‌రెడ్డి, సభ్యులుగా నాగేందర్, జ్ఞాన్‌ప్రకాశ్‌రెడ్డి, కొలుపుల రమేశ్, ప్రభాకర్‌రెడ్డి, ఇలియాస్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎంపీడీవో చిలుకూరి శ్రీనివాస్ వ్యవహరించారు.

ట్రెజరీ ద్వారా జీతాలు చెల్లించాలి



నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలుపుతున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

వలిగొండ, ఆగస్టు 13: ట్రెజరీ ద్వారా జీరో వన్‌జీరో పద్దు కింద వేతనాలు చెల్లించాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ జి. రాము కోరారు. సమ్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని లోతుకుంట, ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో మంగళవారం నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. పది సంవత్సరాల నుంచి ప్రభుత్వం మోడల్ స్కూల్ వ్యవస్థను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కారుణ్య నియమాకాలు, జరపాలన్నారు. ఇంటర్మీడియట్ బోధిస్తున్నా పీజీటీలను జేఎల్‌గా, పదోన్నతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్, కనకదుర్గ, పూర్ణిమ, పృథ్వీరాజ్, వెంకటేశం, ప్రవీణ్, అనసూయ, జంతిలాల్, రవీందర్‌రెడ్డి, మంజుల, సుస్మిత, మహేందర్, నవీన్, నగేష్ ఉన్నారు.

బొమ్మలరామారం: మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌ఎంఎస్‌టీఏఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిలువేరు మహేష్, కేదార్నాథ్, శీనయ్య, రూప, సంగీత, పారిజాత, రవిబాబు, శివప్రియ, వినోదరాణి, అన్నపూర్ణ, సింధూర తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయాలి'

వలిగొండ, ఆగస్టు 13: కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను అమలుచేయాలని బీసీ సంఘం మండల అధ్యక్షుడు బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి డిమాండ్ చేశారు. కవి జూలూరు గౌరిశంకర్ రచించిన 'మా వాటా మాకే అనే' పుస్తకాన్ని మంగళవారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన బీసీ జనగణన చేపట్టి, 42శాతం స్థానిక సంస్థల్లో వాటా కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, నాయకులు ఉపేందర్ బోస్, పాండారి, ప్రభాకర్, నారాయణ, భాస్కర్, అజయ్, లింగస్వామి, బాల్‌నర్సింహ, సాయి, యాదగిరి, నరహరి నరేందర్, పాల్గొన్నారు. మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో 'మా వాటా మాకే' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారయణ, రాఘునాథన్‌గౌడ్, భిక్షపతి, సుమన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వయనాడ్ వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 13: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో సంభవించిన వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్, సీపీఐ ఆధ్వర్యంలో వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. దేశంలో ఎక్కడైన ఆకస్మిక విపత్తులు సంభవించినా ప్రజలంతా ఐక్యమత్యంతో సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బండి జంగమ్మ, కల్లెపల్లి మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, కంబాల వెంకటేష్, పేరబోయిన బంగారి, గుండు వెంకటేష్, మాటూరి మల్లయ్య, కె. నర్సింహ పాల్గొన్నారు.

సేఫ్టీ మోకులతో ప్రమాదాల నివారణ

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 13: సేఫ్టీ మోకులతో గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా కాపాడవచ్చని ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ సైదులు అన్నారు. కాటమయ్య రక్షసేఫ్టీ కిట్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా గుట్ట మునిసిపాలిటీ పరిధిలోని యాదగిరిపల్లిలో గీత కార్మికులకు మంగళవారం శిక్షణ ఇచ్చారు. కాటమయ్య రక్షణ కవచం సేఫ్టీ మోకులతో తాటిచెట్లు ఎక్కే పద్ధతి, ప్రమాదాలు నివారించడానికి మోకు ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములుగౌడ్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య, ఎక్సైజ్ సీఐలు దీపిక, రవి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్కట విహారం

- గుంపులు గుంపులుగా తిరుగుతున్న కోతులు
- దాడిచేసి గాయపరుస్తుండడంతో గ్రామస్థుల భయాందోళన
- ఇంట్లోకి జొరబడి కూరగాయలు, వస్తువులు ఎత్తుకెళ్తున్న వైనం



ఓ ఇంటిపై గుంపులు గుంపులుగా చేరిన కోతులు, కోతుల దాడిలో గాయపడిన వ్యక్తి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 13: భూదాన్‌పోచంపల్లి పట్టణంలోని వీధుల్లో కోతులు స్వైర్యవిహారం చేస్తున్నాయి. ఇళ్ల కప్పులపై విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ఇంటి గుమ్మం తెరవగానే ఇంట్లోకి వచ్చి కూరగాయలు, పప్పులు తదితర వస్తువులు ఎత్తుకెళ్తుండడంతో మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఇళ్లలోకి చొరబడ్డ సమయంలో వాటికి తరమడానికి చూస్తే ఎదురు తిరిగి దాడులు చేసి గాయపరుస్తున్నాయి. ఆరు నెలలుగా పట్టణంలో కోతుల బెడద ఎక్కువైంది. పాఠశాలల ఆవరణ, ఇళ్లపై, పొలాల్లో, చెట్లపై గుంపులుగుంపులుగా చేరి కిష్కింద కాండ చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయని పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రగతి నగర్‌కాలనీలో కోతులను తరిమే క్రమంలో కోతులు దాడి చేయడంతో ఏలె లక్ష్మమ్మ(80) కిందపడి నడుం విరిగింది. చికిత్స పొందుతూ మృత్యువాత పడింది. పలువురిని కోతులు గాయపరిచి ఆస్పత్రుల పాలుచేశాయి. ఆదివారం మండలపరిధిలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన శాపాక అండాలుపై కోతులు దాడిచేసి గాయపర్చడంతో ఆస్పత్రిలో చికిత్స పొందింది. మంగళవారం పట్టణంలోని బీఆర్ఎస్ నాయకుడు బొక్క సత్తిరెడ్డి ఇంట్లో కోతులను తరలించేందుకు యత్నించగా అవి గుంపుగా దాడిచేసి ఆయనను గాయపరిచాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

జలాల్‌పూర్‌లో భయం.. భయం..

జలాల్‌పూర్‌లో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. కోతుల భయంతో పగలు కూడా కిటికీలు మూసి ఉంచుతారు. పిల్లలే కాదు పెద్దలు కూడా ఒంటరి గా బయటకు రావాలంటే భయపడుతునానరు. గుంపులుగా వచ్చి రోడ్లపై వెళ్లే వారిపై, ఇళ్లల్లోకి వచ్చి మరీ దాడులు చేస్తున్నాయి. సమీపంలో ఉన్న హాస్టళ్లలోకి వెళ్లి కూడా దాడులు చేస్తున్నాయి. ఇంటి తలుపులు వేసినా కిటికీల్లోంచి లోపలికి వచ్చి దాడు లు చేస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. సమీపంలోని హాస్టళ్ల ఉండటంతో వాళ్ల వేసే ఆహార పదార్థాల కోసం కోతులు వచ్చి చేరాయని, ప్రస్తుతం వందల సంఖ్యలో కోతులు వస్తున్నాయని పేర్కొంటున్నారు. కోతుల దాడుల్లో ప్రతిరోజూ గ్రామస్థులు గాయాలపాలై ఆస్పత్రులకు వెళ్తున్నారని, ఇప్పటికే చాలా మందిని గాయపర్చాయని చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల బొడద నుంచి తమను కాపాడాలని వేడుకుంటున్నారు. మంగళవారం పట్టణంలోని 13వ వార్డులో బొక్క సత్తిరెడ్డి తన ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా ఒక్కసారిగా కోతులు అతనిని చుట్టుముట్టాయి. మీద పడి దాడి చేయగా గాయపడ్డాడు. అక్కడున్న కోతులను బెదిరిండంతో అవి పరారయ్యాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



నేను ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా ఆరేడు కోతులు నాపై దాడి చేశాయి. వాటిని తరిమే ప్రయత్నం చేయగా ఒక్కసారిగా పదుల సంఖ్యలో కోతులు నన్ను చుట్టుముట్టి దాడి చేశాయి. ఈ సంఘటనలో గాయాలు కాగా, వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాను. భూదాన్‌పోచంపల్లి పట్టణంలో కోతుల బెడదను నివారించాలి.

\- బొక్క సత్తిరెడ్డి, భూదాన్‌పోచంపల్లి

కోతుల బెడద సమస్య తీవ్రంగా ఉంది

భూదాన్‌పోచంపల్లి పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. సమస్య తీవ్రతను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. ప్రాదమిక ఆరోగ్య కేంద్రంలో కోతుల దాడిలో గాయపడిన వారికి వ్యాక్సిన్ అందుబాటులోఉంది. ప్రభుత్వ పరంగా అధికారుల సూచనల మేరకు కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకుంటాం.

\- వీరారెడ్డి, భూదాన్‌పోచంపల్లి మునిసిపల్ కమిషనర్.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



బీబీనగర్‌లో...



చౌటుప్పల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



మోత్కూరులో...

చౌటుప్పల్‌టౌన్, మోత్కూరు, వలిగొండ, బీబీనగర్, ఆలేరు రూరల్, గుండాల, ఆగస్టు 13: జిల్లాలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. చౌటుప్పల్‌లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ ర్యాలీలో పాల్గొన్నారు. మోత్కూరులో మహాత్మాగాంధీ విగ్రహానికి బీజేపీ నాయకులు పోచం సోమయ్య, దీటి సందీప్ పూలమాలలు వేశారు. వలిగొండలో బీజేవైఎం నాయకులు ర్యాలీ నిర్వహించారు. బీబీనగర్‌లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామహేందర్ గుప్తా, కసగోని వంశీగౌడ్ ఆధ్వర్యంలో తిరంగ యాత్ర నిర్వహించారు. ఆలేరులో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి జాతీయ సమైక్యతా ర్యాలీని ప్రారంభించారు. గుండాలలో బీజేవైఎం నాయకుడు జనమేజయ బురెడ్డి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు.



ఆలేరులో ర్యాలీ ప్రారంభిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి



వలిగొండలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

పీహెచ్‌సీలో డ్రోన్ ట్రయల్‌రన్



రాజాపేట, ఆగస్టు 13: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డ్రోన్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలో రక్త నమూనాలను సేకరించి బీబీనగర్ ఎయిమ్స్‌కు డ్రోన్ ద్వారా అందజేశారు. రాజాపేట నుంచి ఎయిమ్స్‌కు 20నిమిషాల్లో చేరిందని ప్రయోగం విజయవంతమైందని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

అడ్డగూడూరు, ఆగస్టు 13: రసాయనిక ఎరువుల తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని డీఏవో అనురాధ సూచించారు. రైతు నేస్తం శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం జరిగిన సదస్సులో మాట్లాడారు. అనంతరం పత్తి, వరి పంటలను పరిశీలించారు. రుణమాఫీ కాలేదని రైతులు డీఏవో దృష్టికి తీసుకెళ్లారు. రుణమాఫీ కాని రైతులు సమస్యపై సబ్‌కమిటీ వేశారని, ఈనెల 20న తేదీలోపు పరిష్కరిస్తారన్నారు. అనంతరం ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు.

ఆత్మకూరు(ఎం): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రంలోని రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు మొక్క జొన్న, చిరుధాన్యాల పంటల యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆలేరు ఏడీఏ బి. వెంకటేశ్వర్‌రావు, ఏఈవో మనిషా, బి. ఇంద్రారెడ్డి, కె. బీరయ్య పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు పనులు పూర్తిచేయాలి : సీపీఐ

రామన్నపేట, ఆగస్టు 13: రామన్నపేటలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రమాదాలు నివారించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రహదారి బంగ్లాలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా రామన్నపేటను నియోజకవర్గంగా ఏర్పాటు చేయాలన్నారు. ధర్మారెడ్డిపల్లి, పిలాంపల్లి కాల్వలను పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందించాలన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని వంద పడకల హాస్పిటల్‌గా మార్చి అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నర్సింహ, నాయకులు ఎర్ర రమేష్, శివరాత్రి సమ్మయ్య, భగవంత, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగం పటిష్ఠతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్సీ

భువనగిరి టౌన్, ఆగస్టు 13: విద్యారంగం పటిష్ఠతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. భువనగిరిలో సోమవారం రాత్రి జరిగిన జిల్లా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం సమావేశంలో మాట్లాడారు. విద్యారంగ పటిష్ఠంలో భాగంగానే డీఎస్సీ నిర్వాహణ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. ఎలాంటి వివాదాలు లేకుండా బదిలీలు, పదోన్నతులు పూర్తవడం హర్షనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యా బోధన అందించేలా ఉపాధ్యాయులు చిత్తశుద్ధి చూపాలన్నారు. జిల్లాలో పదోన్నతులు పొందిన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొడ్డు కృష్ణయ్య, నాగటి వెంకటేష్, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలి

భువనగిరి రూరల్, ఆగస్టు 13: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి వార్డుల వారీగా ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. ఓటరు జాబితా రూపకల్పనపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణపై మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఎల్‌ఆర్ఎస్ స్కీం విధివిధానాలు, గ్రామాల వారీగా వనమహోత్సవం లక్ష్యం, వానాకాలం దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో పారిశుధ్య చర్యలు, దోమల నివారణ తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి దినకర్ తదితరులు పాల్గొన్నారు.

బలవంతపు చదువులు వద్దు

భువనగిరి టౌన్, ఆగస్టు 13: చదువు కోసం పిల్లల మనసును నిర్బంధించొద్దని, బలవంతపు చదువులతో మానసిక స్థిరత్వాన్ని కోల్పోతారని తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ ఎంఏ కరీం అన్నారు. భువనగిరిలో మంగళవారం జరిగిన సదస్సులో మాట్లాడారు. సామాజిక విజ్ఞానం, వినోదంతోనే పిల్లల్లో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతుందన్నారు. చదువులపై పిల్లల్లో ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. అంతర్జాతీయ ఇంద్రజాలికుడు రామకృష్ణ మెజీషియన్ షో విద్యార్థులను ఆకట్టుకుంది.

మోత్కూరులో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలి



మోత్కూరులో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

మోత్కూరు, ఆగస్టు 13: మోత్కూరు మండలకేంద్రంలో 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మోత్కూరు పీహెచ్‌సీలో రోగులు, ప్రజలతో సంతకాలు సేకరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ మాట్లాడుతూ మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల, ఆత్మకూరు(ఎం) మండలాల్లో పెద్ద ఆస్పత్రులు లేక ప్రజలు రోగాల బారిన పడినప్పుడు చికిత్స కోసం ఆయా మండలాలకు సుమారు 60, 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట, జనగామ జిల్లా కేంద్రాల ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో బాధితులు వ్యయ, ప్రయాసలకు గురవడంతో పాటు అంతదూరం వెళ్లేలోపు ప్రాణాపాయం కూడా జరుగుతున్నదని ఆవేదన చెందారు. సుమారు 40 ఏళ్లుగా ఇక్కడ 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ప్రజలు ఉద్యమిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. 30 పడకల ఆస్పత్రి ఏర్పాటు చేస్తే సుమారు 80గ్రామాల ప్రజలకు వైద్య సౌకర్యం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కలిమెల నర్సయ్య, గంజి రాములు, సత్తయ్య, నరేష్, వెంకటేశ్, మత్స్యగిరి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవిపై ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేదు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 13: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవిపై ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేదని మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మంత్రి పదవి కోసమే కలవరిస్తున్నారు తప్ప నియోజకవర్గం అభివృద్ధిపై ఆయనకు ఆలోచన లేదన్నారు. మంత్రి పదవి రాగానే పనులు చేస్తానని చెబుతున్న రాజగోపాల్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉంటే పనులు చేయలేరా అని ప్రశ్నించారు. గతంలో బీఆర్ఎస్‌ను కుటుంబ పాలన సాగిస్తుందంటూ గగ్గోలు పెట్టిన రాజగోపాల్‌రెడ్డికి అన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రిగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ ఒక ఇంట్లో ఇద్దరికి మంత్రి పదవులను ఇస్తే అది కుటుంబపాలన కిందకు రాదా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేయించిన అభివృద్ధి పనులకే శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ గొప్పలు చెప్పుకుంటున్నార న్నారు. ఎన్నికల ముందు తాను చేయించిన రూ.570 కోట్ల పనులను కూడా చేయించలేకపోవడం దురదుష్టకరమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పాల్వాయి స్రవంతి, పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, నాయకులు బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, గిర్కటి నిరంజన్, పెద్దిటి బుచ్చిరెడ్డి, డిల్లీ మాధవరెడ్డి, ఊడుగు మల్లేశం, దయాకరాచారి, తాడూరు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట: మండలం రేణికుంట గ్రామంలో విజయ్ నేత్రాలయ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి, దంత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ సుష్మ, శ్రీనివాస్, బూరుగు శేఖర్‌రెడ్డి, మాధవులు, వెంకటేష్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజాపేట: పంచాయతీకార్యదర్శుల మండల కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా జమీల్, అధ్యక్షులుగా పబ్బారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఇంజ దేవమణి, ప్రధాన కార్యదర్శిగా మాడావత్ గాంధీ, సంయుక్త కార్యదర్శిగా బిర్రు పవన్‌కుమార్, కోశాధికారిగా ఉమేష్, సభ్యులుగా జ్యోతి, మమత, నజీరోద్దీన్, లక్ష్మణ్, మౌనిక, స్వర్ణ ఎన్నికయ్యారు.

సంస్థాన్‌నారాయణపురం: స్వచ్ఛమైన నీటితోనే సంపూర్ణ ఆరోగ్యంలభిస్తుందని వసంత్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి రజిత అన్నారు. నాంది వాటర్ సంస్థ ఆధ్వర్యంలో వసంత్ కెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలు, ఐదు అంగన్‌వాడీ కేంద్రాలకు వాటర్ ఫిల్టర్ క్యాన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాంది వాటర్ మార్కెటింగ్ మేనేజర్ వెంకటస్వామి, హెచ్‌ఎం రమాదేవి, శ్రీనివాస్, నాగరాజు, భాను, అశ్విన్, మహేందర్‌నాథ్ ఉన్నారు.

వలిగొండ: విద్యార్థుల ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో మంగళవారం మాట్లాడుతూ, విద్యార్థులకు రావల్సిన రూ.7వేల కోట్ల బకాయిలు విడుదల చేయాలన్నారు. గురుకులాల్లో విద్యార్థులు చనిపోతుంటే ఎమ్మెల్యేలు, ఎంపీలు మౌనంగా ఉండడం సరైనదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మధు, వైష్ణవి, మహేష్, విష్ణుశ్వరి, సంధ్య మారుతి, భాస్కర్, ఉమదేవి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని ఎంపీడీవో రాములునాయక్ కోరారు. మండలంలోని కొరటికల్, పల్లెపహాడ్, సింగారం, మోదుగుకుంట గ్రామాల్లో కంపోస్టుషెడ్స్, నర్సరీలు, వనమహోత్సవంలో నాటిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో

సంక్షిప్త సమాచారం..

బి.రమేష్, పంచాయతీ కార్యదర్శులు శేఖర్, సుజాత. నరేందర్ ఉన్నారు.

సంస్థాన్‌నారాయణపురం: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలకేంద్రంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఈసీ విద్యాసాగర్ ఆదర్శ పాఠశాల విద్యార్థినులకు యూత్ కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు అందే నరేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మువ్వన్నెల రంగుల గాజులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమాదేవి, కట్ల భాస్కర చారి, చిలువేరు శంకర్,బైకని నరేందర్ యాదవ్, ఎస్.కె గౌస్ పాషా పాల్గొన్నారు

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని చిమిర్యాల గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మాజీ సర్పంచ్ తుమ్మల నర్సిరెడ్డి అందజేశారు. సీఎం సహాయనిది చెక్కులను మంజూరు చేయించేందుకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం దొల జంగయ్య, సుర్వి కృష్ణమూర్తి, వోగూరి చంద్రయ్య, కేసాని రమేష్, కేసాని అంజయ్య, చంద్రయ్య పాల్గొన్నారు

సంస్థాన్ నారాయణపురం: రాచకొండ స్వయంభుశంభులింగేశ్వర ఆలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయాల వద్ద మంచినీటి వసతి కల్పించాలని రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణకుమార్‌యాదవ్ ప్రకటనలో కోరారు. రాచకొండలో దేవాలయాల వద్ద తాగడానికి నీరులేక భక్తులు పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

చౌటుప్పల్ టౌన్: సౌండ్స్ అండ్ లైటింగ్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా దంటిక శ్రీను, ఉపాధ్యక్షులుగా బుర్ర ముత్యాలు, ఎర్రగుంట శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా బిజిలి నరేష్, కోశాధికారిగా ఫరీద్, కార్యదర్శులుగా పాండు, వెంకటేష్, రంజిత్, కిరణ్ ఎన్నికయ్యారు.

మోత్కూరు: రాజమాత ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో మండలంలోని పాటిమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, కంపాస్‌బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మిర్యాల దామోదర్, రాజమాత ఫౌండేషన్ ప్రతినిధులు ఎ. ఉదయ్‌కుమార్, ఎ. మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు ఎం. లింగమల్లు, జి. వెంకటేశ్వర్లు, బి. మల్లయ్య, వి. యాదయ్య, డి.వెంకన్న, సిహెచ్.యాదయ్య, కె. రంగారెడ్డి, కె. కవిత, కె. కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

మోత్కూరు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేసి బదిలీపై వెళుతున్న సిబ్బందిని డాక్టర్లు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. నూతనంగా వచ్చిన సిబ్బందికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డాక్టర్లు హేమంత్‌కుమార్, నిరోషా, అమరావతి, సిబ్బంది పాల్గొన్నారు.

మోత్కూరు: మండలంలోని కొండగడప ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీ, పదోన్నతిపై వెళుతున్న ఉపాధ్యాయులు జి. శ్రీనివాసరావు, బి. హనుమంతు, వై. రవీందర్‌రెడ్డి, జి. పుష్పలతను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లెంకల సుజాతవేణు, ఎర్రవెల్లి మల్లమ్మయాదయ్య, హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వర్లు, ఏఏపీసీ ఛైర్మన్ టి.మాధవి, ఉపాధ్యాయులు ఎం. శ్యామల, జి. శ్రీనివాస్, ఎ. సత్తయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: ఈజీఎస్ కార్మికులు స్వయం ఉపాధితో ఎదగాలని డీఆర్‌డీవో నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వంగపల్లి గ్రామంలో ఈజీఎస్ పథకంలో 100రోజులు పూర్తి చేసుకున్న కార్మికులకు కుటీరపరిశ్రమలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీవో సురేష్, ఎంపీడీవో నవీన్‌కుమార్, ఎంపీవో సలీం పాల్గొన్నారు.

బొమ్మలరామరం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలలో పీజీటిగా విధులు నిర్వహిస్తున్న ఎం వినోదరాణి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ సాధించారు. మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్ మహేశ్, ఉపాధ్యాయులు వినోదరాణిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూప, సింధూర, పారిజాత, సంగీత, సునీత, మాధవిలత, శివప్రియ, అన్నపూర్ణ, విజయలక్ష్మీ, రేణు ఉన్నారు.

బొమ్మలరామారం: చీకటిమామిడి గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన రేగు పాపమ్మ కుటుంబానికి బీర్ల యువసేన అధ్యక్షుడు జూపల్లి శ్రీకాంత్ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.